క్లుప్తంగా

వేట్లపాలెం జెడ్పీ ఉన్నత పాఠశాల పరిశీలన



పాఠశాల భవనాన్ని పరిశీలించిన ఆర్జేడీ నాగమణి బృందం

సామర్లకోట: మండల పరిధిలోని వేట్లపాలెం జెడ్పీ హైస్కూల్ తరగతి గదులను ఆర్జేడీ నాగమణి బృందం గురువారం సాయంత్రం పరిశీలించారు. ఇటీవల జరిగిన జెడ్పీ సర్వసభ్య సమావేశంలో ఎంపీపీ బొబ్బరాడ సత్తిబాబు ఈ పాఠశాల తరగతి గదులు శిథిలావస్థలో ఉన్నాయని, వాటి స్థానే కొత్త గదులను నిర్మించాలని ప్రస్తావించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఆర్జేడీ బృందం తరగతి గదులను పరిశీలించి బీటలువారిన గోడలను గుర్తించి, బిల్డింగ్ ప్లాన్, క్వాలిటీ శాంపిల్స్ అత్యవసరంగా తయారు చేసి నివేదిక ఇవ్వాలని ఇంజినీరింగ్ శాఖను ఆదేశించింది. ఎస్ఈ బీవీవీ సత్యనారాయణ, డీఈ ఎన్ఎస్‌డీ సత్తిరాజు, పంచాయతీ రాజ్ డీఈ వి.భాస్కరరమేష్, ఎంపీపీ బొబ్బరాడ సత్తిబాబు, ఎంఈఓ–1 వై.శివరామకృష్ణయ్య, విద్యా కమిటీ చైర్మన్ సత్యనారాయణ, పాఠశాల హెచ్ఎం పి.అనురాధ తదితరులు పాల్గొన్నారు.

'అరబిందో' సేవలు ప్రశంసనీయం



శిక్షణ పొందిన వారికి సర్టిఫికెట్లు అందజేసిన అరబిందో ప్రతినిధులు

కొత్తపల్లి: తీర గ్రామాల అభివృద్ధికి అరవిందో ఫార్మా ఫౌండేషన్ చేస్తున్న సేవలు ప్రశంసనీయమని ఇంచార్జి ఏపీఎం సఖీనా ప్రియదర్శిని అన్నారు. మండలంలోని మూలపేటలో యువతీ యువకులకు మహిళా నైపుణ్యాభివృద్ధి, ప్రతిభా కేంద్రం ద్వారా అరబిందో ఫార్మా ఫౌండేషన్, కాకినాడ సెజ్ ఆధ్వర్యంలో ఉపాధి శిక్షణ ఇచ్చారు. శిక్షణ పూర్తి చేసుకున్న 67 మందికి గురువారం సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మేనేజర్ ఎ.శ్రీనివాసరావు, అరవిందో ఫార్మా ఫౌండేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

నేటి నుంచి జిల్లాస్థాయి కబడ్డీ పోటీలు

ప్రత్తిపాడు రూరల్: శ్రీదేవి నవరాత్రులను పురస్కరించుకొని మండలంలోని గజ్జనపూడిలో శుక్రవారం నుంచి జిల్లాస్థాయి కబడ్డీ పోటీలు నిర్వహించనున్నట్లు గురువారం నిర్వాహకులు తెలిపారు. మూడు రోజుల పాటు జరిగే ఈ పోటీల్లో జిల్లాలోని పలు ప్రాంతాలకు చెందిన జట్లు పాల్గొంటున్నాయని చెప్పారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

ప్రత్తిపాడు/ప్రత్తిపాడు రూరల్: చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందిన ఘటనపై కేసు నమోదు చేసినట్టు ప్రత్తిపాడు పోలీసులు గురువారం తెలిపారు. వివరాల్లోకి వెళితే... సామర్లకోట మండలం వీకే రాయపురం గ్రామానికి చెందిన ఇంజరపు చందుకుమార్ (20) ఈ నెల 25వ తేదీ రాత్రి మండలంలోని గజ్జనపూడిలో టెంట్‌హౌస్ సామగ్రి వాహనంపై తరలిస్తుండగా ప్రమాదవశాత్తూ కిందపడి తీవ్రంగా గాయపడ్డాడు. అతడిని స్థానికులు కాకినాడ జీజీహెచ్‌కు తరలించగా చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు స్థానిక ఏఎస్సై ఆదినారాయణ తెలిపారు.

ఉచిత కంటి వైద్య శిబిరం

ప్రత్తిపాడు: మండలంలోని లంపకలోవలో గురువారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. సొసైటీ మాజీ అధ్యక్షుడు గంటా సత్యనారాయణ వర్ధంతి సందర్భంగా ఏర్పాటు చేసిన ఈ వైద్య శిబిరాన్ని ఎంపీపీ గోళ్ల కాంతి సుధాకర్ ప్రారంభించారు. కాకినాడ అంజు ఆసుపత్రి వైద్యులు సుమారు 150 మంది రోగులకు కంటి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు గొంతిన సురేష్, జేసీఎస్ మండల కన్వీనర్ రామిశెట్టి చినబాబు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పంచాది వీరబాబు, మండల కో ఆప్షన్ సభ్యుడు గంటా మహలక్ష్మీరావు, ఏఎంసీ వైస్ చైర్మన్ శేరు కృష్ణ, వైస్ ఎంపీపీ బంకు శ్రీను, గుడాల వెంకటరత్నం తదితరులు పాల్గొన్నారు.

ఏపీఎస్పీలో వ్యాసరచన, వక్తృత్వ పోటీలు

కాకినాడ రూరల్: కాకినాడ మూడవ బెటాలియన్ ఏపీఎస్పీ క్యాంపులో పోలీస్ అమరవీరుల వారోత్సవాలు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా బెటాలియన్ కమాండెంట్ సీహెచ్ విజయరావు ఆదేశాల మేరకు సీహెచ్ భద్రయ్య పర్యవేక్షణలో పాఠశాల విద్యార్థులకు, పోలీసు సిబ్బంది, ఆఫీసర్లకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. అధికారులు, సిబ్బంది మొత్తం 76 మంది, వ్యాసరచన పోటీల్లో 166 మంది, వక్తృత్వ పోటీలలో 45 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమాండెంట్ పి.సత్యం, ఆర్ఐలు సురేష్ బాబు, వి.రాము, సతీష్, గణేష్, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

● ఆత్మీయ స్వాగతం







రాజానగరం ఎమ్మెల్యే జక్కంపూడి రాజా సోదరుడు, వైఎస్సార్ సీపీ యువజన విభాగం ఉభయ గోదావరి జిల్లాల రీజనల్ కో ఆర్డినేటర్ జక్కంపూడి గణేష్ వివాహ రిసెప్షన్ దివాన్ చెరువులోని డీబీవీ రాజు లేఅవుట్‌లో గురువారం వైభవంగా జరిగింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. తొలుత సీఎం జగన్‌కు ఎంపీ వంగా గీత, పిఠాపురం ఎమ్మెల్యే పెండెం దొరబాబు, జెడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు పుష్పగుచ్ఛాలతో ఘన స్వాగతం పలికారు.

నాణ్యమైన వైద్యమే ప్రభుత్వ లక్ష్యం



సీబీ దేవం శిబిరంలో మాట్లాడుతున్న జెడ్పీటీసీ సభ్యుడు సూరిబాబు



యండపల్లిలో రోగులకు మందులు అందిస్తున్న నాయకులు



వేట్లపాలెంలో రోగులకు మందుల కిట్లు అందజేస్తున్న ఎంపీపీ సత్తిబాబు



రాపర్తిలో రోగులకు మందులు అందిస్తున్న అధికారులు, నాయకులు

- జెడ్పీటీసీ గవరసాని సూరిబాబు
- సీబీ దేవంలో ఆరోగ్య సురక్ష శిబిరం

పెద్దాపురం: ప్రజల ఆరోగ్య సమస్యలను గుర్తించి ప్రతి ఒక్కరికీ నాణ్యమైన వైద్యాన్ని అందించడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని జెడ్పీటీసీ గవరసాని సూరిబాబు, ఎంపీటీసీ రాయి వెంకటేశ్వరరావు అన్నారు. మండలంలోని సీబీదేవం గ్రామంలో సర్పంచ్ శ్రీనివాస్ అధ్యక్షతన గురువారం జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. దేశంలోని ఎక్కడా లేని విధంగా ప్రతి ఇంటికీ వెళ్లి ఆరోగ్య సమస్యలు తెలుసుకుంటున్న ప్రభుత్వం వైఎస్సార్ సీపీయేనన్నారు. ప్రజల ఆరోగ్య సమస్యలు గుర్తించి తగు వైద్యం అందించడంతో పాటు గర్భిణులు, బాలింతలు, రక్తహీనత బాధితులపై ప్రత్యేక శ్రద్ధ చూపిస్తూ ఉచితంగా మందులు పంపిణీ చేస్తున్న ప్రభుత్వం జగనన్న ప్రభుత్వమేన్నారు. ఈ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. పంచాయతీ కార్యదర్శి త్సలికి దొరబాబు, బచ్చలరాజు, వైద్య సిబ్బంది, వలంటీర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రాణం విలువ తెలిసిన సీఎం జగన్

సామర్లకోట: ప్రజల ప్రాణం విలువ తెలిసిన నాయకుడు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అని ఎంపీపీ బొబ్బరాడ సత్తిబాబు అన్నారు. వేట్లపాలెం గ్రామంలో ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఆయన గురువారం ప్రారంభించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు వైద్యులు పి.ప్రశాంత్, శ్రీహిమవతి రోగులను పరీక్షించారు. ఈఓపీఆర్డీ కర్రి హరికృష్ణసత్యారెడ్డి, ఎంఈఓ–2 పి.పుల్లయ్య, పంచాయతీ కార్యదర్శి మోషే, ఆరోగ్య సిబ్బంది, పంచాయతీ సిబ్బంది, సచివాలయ సిబ్బంది రోగులకు సేవలందించారు. శిబిరం వద్ద మహిళా సమాఖ్యలు ఏర్పాటు చేసిన పోషకాహార స్టాళ్లను ఎంపీపీ, వైద్యులు పరిశీలించారు.

ఆరోగ్య ఆంధ్రప్రదేశ్‌నే లక్ష్యం

కొత్తపల్లి: రాష్ట్రాన్ని ఆరోగ్య ఆంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తోందని యండపల్లి ఉప సర్పంచ్ గుండ్రా చిన్నారావు అన్నారు. మండలంలోని యండపల్లి గ్రామ సచివాలయం వద్ద గురువారం జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం నిర్వహించారు. కొత్తపల్లి ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యాధికారి సుష్మ పర్యవేక్షణలో డాక్టర్లు 406 మందికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా గ్రామాల్లో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుతున్నాయన్నారు. ప్రజలు ఆరోగ్య సురక్ష శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ శీలం పెద అప్పారావు ఎంపీడీఓ పి.వెంకటనారాయణ వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పేదలకూ కార్పొరేట్ వైద్యం

పిఠాపురం: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా పేదలకూ కార్పొరేట్ వైద్యం అందుతోందని ఎంపీడీఓ చిన్నారావు అన్నారు. మండలంలోని రాపర్తిలో గురువారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్లు 456 మందికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో న్యూట్రిషన్ స్టాల్‌ను ఏర్పాటు చేశారు. గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైద్య ఆరోగ్య, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

సీతాఫలం కనుమరుగు!

- లాభసాటి కాకపోవడంతో క్రమంగా తగ్గుతున్న సాగుభూమి
- చెట్ల స్థానే రియల్ ఎస్టేట్లు
- దిగుబడి తగ్గి ధర భారం

సామర్లకోట: కాలానుగుణంగా ప్రకృతి ప్రసాదించిన ఫలాలను తీసుకోవడం ద్వారా ఆ కాలంలో ఎదురయ్యే దుష్ప్రభావాలను బలంగా ఎదుర్కొనవచ్చని వైద్యులు సూచిస్తుంటారు. తీరా ఆ కాలం వచ్చాక ఆయా కాలాల్లో వచ్చే ఫలాలు సామాన్యుడికి చేతికి అందనంత ఎత్తులో ఉంటున్నాయి. ఈ కాలంలో పండే సీతాఫలానిదీ అదే పరిస్థితి. మెట్ట ప్రాంతంలో ఈ తోటలు ఎక్కువే. కానీ పంటలు లాభసాటి కాకపోవడంతో రైతులు తమ భూములను విక్రయిస్తుండడంతో అవి రియల్ ఎస్టేట్లుగా, ఇండస్ట్రియల్ ఏరియాలుగా మారిపోతున్నాయి. గతంలో రాజానగరం నుంచి రాజమహేంద్రవరం వరకు ఏడీబీ విస్తరణ కాకముందు రోడ్డుకు ఇరువైపులా సీతాఫలం తోటలు ఉండేవి. దాంతో రాజమహేంద్రవరం సమీపంలో దివాన్ చెరువు వద్ద వీటికి పెద్ద మార్కెట్టే ఉండేది. ఉన్న కొద్దిపాటి భూముల్లో పండే సీతాఫలాలు డిమాండ్ రీత్యా ధరలు ఆకాసంలో ఉంటూ సామాన్యుడికి అందడం లేదు.

వర్షాలు లేక.. కాపు కాయక..

సీతాఫలాలు కాసేందుకు అవసరమయ్యే వర్షాలు మరీ ముఖం చాటేయడంతో దిగుబడి గణనీయంగా తగ్గిపోయి చాలా నష్టపోయామని రైతులు అంటున్నారు. ప్రస్తుతం రంగంపేట మండలం, అటవీ ప్రాంతాల నుంచి మాత్రమే సీతాఫలాలు వస్తున్నాయి. 25 సీతాఫలాలు రూ.800 నుంచి రూ.900 వరకు విక్రయిస్తున్నారు.

భారీగా చెట్ల నరికివేత



మెట్ట ప్రాంతంలో ఉండే సీతాఫల చెట్లను నరికేస్తున్నారు. దీంతో రంగంపేట, ఏజెన్సీ ప్రాంతాల నుంచి వంద పండ్లను రూ.1200 నుంచి రూ.1,500కు కొనుగోలు చేసి విక్రయిస్తున్నాం. పండ్లు తయారు కాకపోవడంతో ప్రజలు కొనుగోలు చేయడం లేదు. 20 ఏళ్లుగా రంగంపేట మండలం కోటపాడు నుంచి సామర్లకోట వచ్చి ఆయా సీజన్లలో పండ్లు విక్రయిస్తున్నా.

– బి.వెంకటేశ్వర్లు, పండ్ల వ్యాపారి, కోటపాడు



కొనేవారు లేక వెల వెలబోతున్న సీతాఫలాల అమ్మకాలు

పండ్ల మొక్కలపై అవగాహన పెరగాలి



ప్రజల ఆరోగ్యం కాపాడటానికి ప్రస్తుత సీజన్‌లో మొక్కలు నాటే సమయంలో పండ్ల మొక్కలు నాటడంపై అవగాహన పెంచాలి. సీతాఫలం, మామిడి, నేరేడు వంటి పండ్ల మొక్కలను ప్రభుత్వ స్థలాలు, రోడ్డు మార్జిన్‌లోను, పాఠశాలల ఆవరణలోను నాటేలా చర్యలు తీసుకోవాలి. అప్పుడే భావితరాల ఆరోగ్యాన్ని కాపాడే పండ్ల మొక్కలపై అవగాహన ఉంటుంది.

– గోపు నారాయణమూర్తి, రైతు సంఘ నాయకుడు, తాటిపర్తి

ఘనంగా అయ్యప్ప పడిపూజ

పెద్దాపురం: అయ్యప్ప స్వాముల సామూహిక పడిపూజ మండలంలోని గుడివాడలో గురువారం రాత్రి ఘనంగా నిర్వహించారు. వైఎస్సార్ సీపీ నాయకులు, సర్పంచ్ కనపర్తి చీమదొరస్వామి ఆధ్వర్యంలో సుమారు 2000 మంది స్వాములు పాల్గొన్నారు. వడిశలేరు రాంబాబు గురుస్వామి శర్మ, పెచ్చెట్టి నూకామణి గురుస్వామి లక్ష బిల్వార్చన, దీపాలంకరణ, పదునెట్టాంబడి పూజను నిర్వహించారు. ఈ పూజలో ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు, మున్సిపల్ వైస్ చైర్మన్ నెక్కంటి సాయి ప్రసాద్, జెడ్పీటీసీ గవరసాని సూరిబాబు తదితరులు హాజరయ్యారు.

పారదర్శకంగా ఓటర్ల జాబితా

కాకినాడ సిటీ: ఓటర్ల జాబితా ముసాయిదా రూపకల్పన నేపథ్యంలో ఇప్పటి వరకు నమోదైన ఓటర్ల వివరాలు పొందుపరచడంతో పాటు నూతన ఓటర్ల నమోదుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఆర్డీవో ఈట్ల కిశోర్ వివరించారు. ఆయన గురువారం రూరల్ నియోజకవర్గ రాజకీయపార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈనెల 28, 29 తేదీల్లో ప్రత్యేక ఓటర్ల నమోదు శిబిరాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ముఖ్యంగా యువ ఓటర్ల నమోదుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో రాజకీయ పార్టీ ప్రతినిధులు రావూరి వెంకటేశ్వరరావు, గదుల సాయిబాబా, ఎస్ అప్పారావు, టి.రమణమూర్తి, టి.నాగేశ్వరరావు, పి.చర్యన్, రూరల్ తహసీల్దార్ మురార్జీ తదితరులు పాల్గొన్నారు.

ఖాళీ స్థలం కనిపిస్తే కబ్జా



అమీనాబాదులో ఆక్రమణకు గురైన కాలువ



ఉప్పాడ-పిఠాపురం రోడ్డులో ఆక్రమణకు గురైన డ్రైన్



ఉప్పాడ సెంటర్‌లో పూర్తిగా మూసుకుపోయిన కాలువ

- గ్రామాల్లో ప్రభుత్వ స్థలాల ఆక్రమణ
- పట్టించుకోని అధికారులు

కొత్తపల్లి: రోడ్డును ఆనుకుని ఉన్న ప్రభుత్వ స్థలాలను కొందరు ఆక్రమించి షాపులు నిర్మిస్తున్నారు. పట్టించుకోవాల్సిన సంబంధిత అధికారులు తమకేమీ పట్టనట్టు వ్యవహరిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. మండలంలోని పిఠాపురం–ఉప్పాడ రోడ్డు, అమీనాబాదు సెంటర్‌లో కొందరు వ్యక్తులు ఇష్టానుసారంగా రోడ్డుకు ఇరువైపులా ఉన్న ప్రభుత్వ స్థలాలను ఆక్రమించి షాపులను నిర్మించారు. రాత్రికి రాత్రే ఇరిగేషన్ కాలువలు, ప్రభుత్వ స్థలాలను ఆక్రమించి నిర్మాణాలు చేపడుతున్నారు. దీంతో బీచ్‌రోడ్డులో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. గంటల కొద్దీ వాహనాలు నిలిచిపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. డ్రైన్లను ఆక్రమించడంతో మురుగు నీరు, వర్షపునీరు ముందుకు ప్రవహించడం లేదు. కొన్ని ప్రాంతాల్లో పంట కాలువలను ఆక్రమించడంతో వర్షం వస్తే పంట పొలాలు ముంపు బారిన పడుతున్నాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సబంధిత అధికారులు స్పందించి ఆక్రమణ దారులపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

వైభవంగా దుర్గమ్మ నిమజ్జనోత్సవాలు



పిఠాపురంలో అమ్మవారిని ఊరేగిస్తున్న భక్తులు

పిఠాపురం: దేవీనవరాత్రులు ముగియడంతో గ్రామాల్లో కనకదుర్గమ్మ నిమజ్జనోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. నియోజకవర్గంలోని పిఠాపురం, గొల్లప్రోలు మండలాల్లో గురువారం కనకదుర్గాదేవి విగ్రహాలను మేళతాళాలు, బాణసంచా కాల్పుల నడుమ ఊరేగించి కాలువలు, చెరువుల్లో నిమజ్జనం చేశారు. గొల్లప్రోలు, పిఠాపురం పట్టణాల్లోని అమ్మవారి ఊరేగింపులో గరగల నృత్యాలు, శక్తివేశాలు భక్తులను ఎంతగానో ఆకట్టుకున్నాయి.

సామర్లకోటలో...



సామర్లకోటలో సాగుతున్న అమ్మవారి నిమజ్జన ఊరేగింపు

సామర్లకోట: శరన్నవరాత్రి ఉత్సవాల ముగింపును పురస్కరించుకుని అమ్మవారి విగ్రహాల నిమజ్జనాలు కొనసాగుతున్నాయి. దీనిలో భాగంగా గురువారం పట్టణ పరిధిలో ఏర్పాటు చేసి శిబిరాల వద్ద ఉన్న కనకదుర్గ అమ్మవారిని ప్రత్యేక వాహనంలో ఊరేగించారు. మ్యూజికల్ బ్యాండ్, గరగ నృత్యాలలో ఊరేగింపులు జరిగాయి. ట్రాక్టర్‌పై ఏర్పాటు చేసిన విగ్రహాన్ని భక్తులు స్థానిక పంచారామ క్షేత్ర ముఖద్వారం వద్ద గోదావరి కాలువ రేవులో నిమజ్జనం చేశారు.

అన్నసమారాధన

కొత్తపల్లి: దేవీ నవరాత్రుల ముగింపును పురస్కరించుకుని స్థానిక గాదులదొడ్డిలో వేంచేసిన బాలదుర్గ ఆలయం వద్ద గురువారం భారీ అన్నసమారాధన నిర్వహించారు. దాతల సహకారంతో ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో పలు రకాల వంటకాలతో పెళ్లి విందును తలపించేలా అన్నదానం చేశారు. కొత్తపల్లి, వాకతిప్ప, కుతుకుడుమిల్లి, ఉప్పాడ తదితర గ్రామాలకు చెందిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని అన్నప్రసాదం స్వీకరించారు. ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ఓటర్ల నమోదు నిరంతర ప్రక్రియ

- ఈఆర్ఓ సత్యనారాయణ మూర్తి



రాజకీయ పార్టీల నాయకులు, ఏఈఆర్ఓలతో సమీక్షిస్తున్న ఈఆర్ఓ సత్యనారాయణమూర్తి

తుని రూరల్: ఓటర్ల నమోదు నిరంతర ప్రక్రియ అని తుని నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ ఆఫీసర్ సత్యనారాయణ మూర్తి అన్నారు. వివిధ రాజకీయ పార్టీల నాయకులు, బీఎల్ఓలతో గురువారం ఆయన వేర్వేరుగా సమావేశం నిర్వహించారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో నిర్వహించిన సమావేశానికి వైఎస్సార్ సీపీ, టీడీపీ, బీజేపీ, కాంగ్రెస్ పార్టీ నాయకులు, తుని, కోటనందూరు మండలాల తహసీల్దార్‌లు, తుని మున్సిపల్ కమిషనర్ హాజరయ్యారు. మండల పరిషత్ కార్యాలయంలో బీఎల్ఓలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈఆర్ఓ సత్యనారాయణ మూర్తి మాట్లాడుతూ వివిధ పార్టీల నాయకులు ఇచ్చిన సలహాలు, సూచనలతో ఓటర్ల జాబితాను సిద్ధం చేశామన్నారు. అభ్యంతరాలకు అనుగుణంగా పోలింగ్ కేంద్రాలు, ఆయా ప్రాంతాల పేర్లను సవరించామన్నారు. అర్హులు ఆన్‌లైన్‌లో ఓటు నమోదు చేసుకోవడం ఎంతో ఉత్తమమైన మార్గమన్నారు. బీఎల్ఓలు సైతం దరఖాస్తులు స్వీకరిస్తారన్నారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికల నిర్వహణకు అన్ని పార్టీల నాయకులు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో వివిధ పార్టీల నాయకులు వంగలపూడి వాసు (వైఎస్సార్ సీపీ), వంగలపూడి బుజ్జి (టీడీపీ), ఆకెళ్ల శాస్త్రి (బీజేపీ), గాలి శ్రీనివాసరావు (కాంగ్రెస్–ఐ), తుని, కోటనందూరు తహసీల్దార్లు శివకుమార్, కుసరాజు, కమిషనర్ ప్రసాదరాజు, ఎలక్షన్ డీటీ ప్రదీప్, ఆర్ఐ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

కార్గో డోర్ డెలివరీ మాసోత్సవాలు ప్రారంభం

గోకవరం: స్థానిక ఆర్టీసీ డిపోలో కార్గో డోర్ డెలివరీ మాసోత్సవాలను డిపో మేనేజర్ యు.రామన్నదొర గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నవంబర్ 25 వరకూ నెల రోజుల పాటు కార్గో డెలివరీ మాసోత్సవాలు నిర్వహిస్తామన్నారు. దీనిలో భాగంగా డిపోలో కార్గోకు బుక్ చేసుకున్న వస్తువులు, ఇతర సామగ్రిని భద్రంగా ఇంటికే డెలివరీ చేస్తామన్నారు. ప్రయాణికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. దసరాలో డిపో నుంచి ప్రత్యేక బస్సు సర్వీసులు నడపడం ద్వారా రూ.12.18 లక్షలు ఆదాయం సమకూరిందన్నారు. దీనికి సహకరించిన సిబ్బందికి ఆయన కృతజ్ఞతలు తెలిపి స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డిపో సూపరింటెండెంట్ అడ్డాల అప్పారావు, పలు యూనియన్ల నాయకులు, సిబ్బంది పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో తనిఖీలు

తుని రూరల్: నియోజకవర్గంలోని తుని, కోటనందూరు, తొండంగి మండలాలు, తుని పట్టణంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో గురువారం ఐసీడీఎస్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. ఐసీడీఎస్ కాకినాడ ప్రాజెక్ట్ డైరెక్టర్ ప్రవీణ పర్యవేక్షణలో తుని, పెద్దాపురం, తాళ్లరేవు, ప్రత్తిపాడు, జగ్గంపేట, శంఖవరం, కాకినాడ జిల్లా నోడల్ అధికారి వై.లక్ష్మి, సీడీపీఓలు అంగన్‌వాడీ కేంద్రాల్లో రికార్డులు, సరకు నిల్వలను పరిశీలించారు. ఆయా ప్రాంతాల్లో లబ్ధిదారులతో మాట్లాడి సరుకులు సక్రమంగా అందుతున్నాయా ? లేదా ? అని ఆరా తీశారు. నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామన్నారు. తనిఖీల్లో సీడీపీఓలు వి.మాధవి, ఎ.జ్యోతి, ఆర్‌వీఎస్ లక్ష్మి, ఎం.పూర్ణిమ, టీడీఆర్ పద్మ, కె.శ్రీలత, జి.ఉషా తదితరులు పాల్గొన్నారు.